సాక్షి అనకాపల్లి

శనివారం : 23 మార్చి : 2024



శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించి వారాంతపు పూజలు నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి:రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.2 నుంచి 33.4, కనిష్టంగా 25.7 నుంచి 25.8, తేమశాతం 77 నుంచి 79, గాలి గంటకు 4 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి	
ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
6.12	4.45
నర్సీపట్నం	
6.15	4.43

న్యూస్‌రీల్

ఎర్త్ అవర్ పాటించాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న యువతులు

బీచ్‌రోడ్డు (విశాఖ): వాతావరణ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న ఎర్త్ అవర్‌ను ప్రతీ ఒక్కరు పాటించాలని యవత సందర్శకులను కోరింది. క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ అండ్ ఫ్రైడ్ ఫర్ ఫ్యూచర్ ఏపీ సంయుక్తంగా ఎర్త్ అవర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థకంగా మారినందున భూమిని కాపాడుకుందాం..పర్యావరణాన్ని రక్షించుకుందాం అంటూ విద్యార్థినులు నినాదించారు. ఎర్త్ అవర్‌లో భాగంగా ఒక గంట పాటు విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా ఆపివేయాలని పిలుపునిచ్చారు.

రగ్బీ క్రీడాకారులకు శిక్షణ



మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకునాయుడు

అచ్యుతాపురం: జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కూండ్రపు వెంకునాయుడు అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో పోటీలు జరగనున్నాయి. ఎంపికైన క్రీడాకారులు శిక్షణ ముగించుకుని ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌కు బయలుదేరనున్నారు. జట్టుకు కోచ్‌గా సుమంత్(గుంటూరు), మేనేజర్‌గా వెంకట్(విశాఖ)లు వ్యవహరించనున్నారు.

'కలియుగం పట్టణంలో' చిత్ర యూనిట్ సందడి



బీచ్‌రోడ్డు: ప్రేమ, తల్లి సెంటిమెంట్‌తో కూడిన ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'కలియుగం పట్టణంలో' చిత్రం నిర్మితమైందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో విశ్వ కార్తికేయ, హీరోయిన్ ఆయూషి పటేల్ కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో, హీరోయిన్ మాట్లాడారు. చిత్రంలో ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను ఉద్వేగానికి గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నటుడు నరేన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అలిమ్‌కో వైద్య శిబిరం



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుమ్మపాల: ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలిమ్‌కో) ఆధ్వర్యంలో దివ్యాంగులకు పంపిణీ చేయనున్న ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరాన్ని జిల్లా విద్య సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో కోటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని జీవీఎంసీ ఉడ్‌పేట ప్రైమరీ స్కూల్లో నిర్వహించిన ఈ శిబిరంలో ఎన్టీఆర్ ఆస్పత్రి ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ డాక్టర్లు వై.గంగాధర్, ఫరుద్దీన్, దివ్యప్రియలు దివ్యాంగ విద్యార్థులను పరీక్షలు జరిపి, ఉపకరణాలకు సిఫార్సు చేశారు. చికిత్సకు అవసరమైన సూచనలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ వివిధ స్కూళ్లలో 18 ఏళ్ల లోపు వయసున్న దివ్యాంగ విద్యార్థులకు వీల్ చెయిర్లు, సీపీ చెయిర్లు, ట్రై సైకిళ్లు, క్లచెస్, వాకర్స్, రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలను అలిమ్‌కో ఉచితంగా అందిస్తుందన్నారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి 107 మంది దివ్యాంగ విద్యార్థులు ఉపకరణాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఉపాధ్యాయులు బీవీ వరప్రసాద్, రమాదేవి, యేసురత్నం, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆధునిక యంత్రపరికరాలతో అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు మరమ్మతు పనులు



వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా రోడ్డు వేస్తున్న దృశ్యం



పొక్లెయిన్ల సాయంతో చకచకా సాగుతున్న పనులు

మార్గం సుగమం

- చురుగ్గా అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి పనులు
- రోడ్డు విస్తరణకు సాంకేతిక అవరోధాలు
- రూ.6.5 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో పనులు
- వచ్చే నెలాఖరు నాటికి పూర్తి
- నెరవేరనున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు సంకల్పం
- సాధ్యమైనంత త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు

అచ్యుతాపురం:

అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి.. జిల్లాలోనే ఎంతో కీలకమైన మార్గం. సెజ్‌కు ముడిసరకులు, నిర్మాణంలో ఉన్న కంపెనీలకు అవసరమైన సామగ్రి, ఉద్యోగుల తరలింపు వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారిని విస్తరించి, అభివృద్ధి పరచాల్సి ఉండగా నిర్వాసితుల ఓట్లు పోతాయన్న భయంతో గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎవరికీ ఇబ్బంది లేని రీతిలో ఇప్పుడు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. 13 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ మార్గాన్ని పూర్తిగా బాగు చేసి ఒక లేయర్ రోడ్డు వేయనున్నారు. సుదీర్ఘ కాలంపాటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు పట్టుదలగా పనులు చేయిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ నిధులు రూ.6.5 కోట్లతో చేపడుతున్న ఈ పనుల్ని రెండు వారాల క్రితం ప్రారంభించగా ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు మరమ్మతు పనులను నిర్వహిస్తున్నారు.

అప్పుడెందుకు విస్తరించలేదు..

తాము అధికారంలో ఉన్నప్పుడు ఉపేక్షించిన ప్రతిపక్ష పార్టీ నేడు తప్పుడు ప్రచారానికి దిగింది. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కొద్ది నెలల నుంచి నానా హడావిడి చేస్తోంది. సెజ్‌లో కార్యకలాపాలు మొదలుపెట్టిన తర్వాత అచ్యుతాపురం-అనకాపల్లి మార్గం విస్తరించాల్సిన ప్రాధాన్యతను ముందే గుర్తించారు. కనీసం 100-150 అడుగుల వరకూ విస్తరించాలని నిర్ణయించారు. సుమారు 9 గ్రామాలు ఈ రోడ్డును ఆనుకొని ఉండటంతో విస్తరణలో చాలా ఆస్తులు పోయే అవకాశం ఉన్నందున విస్తరణ పరిధిని తగ్గించారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే విస్తరణ పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ అప్పటి నేతలు రాజకీయ కోణంలో ఆలోచించి రోడ్డు విస్తరిస్తే నిర్వాసితుల ఓట్లు పోతాయనే భయంతో పనుల్ని అటకెక్కించారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన కన్నబాబు రాజు రెండుసార్లు మరమ్మతు పనులు చేయించారు. సెజ్‌లోని కంపెనీల ఆర్థిక సహకారం కూడా తీసుకొని రహదారిని మెరుగుపరిచారు. కానీ పరిమితికి మించిన వాహనాల తాకిడి, వర్షాలు వంటి కారణాలతో మరమ్మతులు చేపట్టిన కొన్నాళ్లకే మళ్లీ మొదటికొచ్చాయి. తాజాగా విస్తరణ పనులకు సుమారు రూ.400 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. అంతే కాకుండా రోడ్డు పక్కన గ్రామాలు, ఆస్తులకు అందించాల్సిన పరిహారం మరింత పెంచాలని నిర్వాసితులు కోరడం, కొందరు కోర్టును ఆశ్రయించడం జరిగింది. ఈలోపు ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని భావించిన ఎమ్మెల్యే ప్రయాణికుల సౌకర్యార్థం వీఎంఆర్‌డీఏ ద్వారా నిధులు రప్పించారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. చిత్తశుద్ధితో రోడ్డు పనులు చేయిస్తున్న కన్నబాబురాజుకు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



మెరుగులు దిద్దుకుంటున్న అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం



అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి మరమ్మతులు ఎన్నో ఏళ్ల సమస్య. ఏపీఐఐసీ ద్వారా రోడ్డు విస్తరణకు టెండర్ పిలిచి చాలా కాలం అయ్యింది. భూసేకరణలో సాంకేతిక అవరోధాలు ఉన్నందున పనులు చేపట్టలేదు. దీంతో ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వీఎంఆర్‌డీఏ నిధులతో పనులు ప్రారంభించాం. దీనిని కొందరు రాజకీయం చేయాలని చూస్తున్నారు. వారు సంక్షేమ పథకాల అమలులో పోటీ పడితే బాగుంటుంది. రహదారి విస్తరణ సమస్య సాంకేతిక కారణాల వల్ల ఆగిపోతే దీనిని అధికార పార్టీకి ముడిపెట్టకూడదు. ఎన్నో గ్రామాలు, ఎందరో నిర్వాసితులకు సంబంధించిన అంశం ఇది. పనులు వేగంగా జరుగుతున్నాయి. మరమ్మతు పనులు పూర్తయిన తర్వాత ఈ రహదారిలో వాహనదారులకు ఉన్న ఇబ్బందులు పూర్తిగా సమసిపోతాయి.

-కన్నబాబురాజు, యలమంచిలి ఎమ్మెల్యే

వచ్చే నెలాఖరుకు పూర్తి

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. రూ.6.5 కోట్లతో చేపట్టిన ఈ పనులు వచ్చే నెలాఖరు నాటికి పూర్తవుతాయి. ఇది చాలా రద్దీగా ఉండే రహదారి కావడంతో పనులకు కాస్త ఇబ్బంది కలుగుతోంది.

-హసీనా, వీఎంఆర్‌డీఏ అసిస్టెంట్ ఇంజినీర్

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ



గాంధీనగరం హైస్కూల్ వద్ద పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌ను డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు ఎలా జరుగుతున్నాయని పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారిలో ఎంత మంది ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించడంతో తామంతా పాస్ అవుతామంటూ విద్యార్థులు చెప్పడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినులంతా క్రమశిక్షణ కలిగి, పరీక్షలకు బాగా ప్రిపేర్ కావడం పట్ల ఆనందించారు. పదోతరగతి తర్వాత విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ పనితీరును అభినందించారు.

అనకాపల్లి: టెన్త్ పరీక్షా కేంద్రాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్, నర్సింగరావుపేట, నారాయణ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఆయన వెంట సీఐ జి.శంకరరావు ఉన్నారు.

సొంత శాఖ పనులతోపాటే ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

- ఎన్నికల నియమావళి పటిష్ట అమలుకు చర్యలు
- సిబ్బందితో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమ సొంత శాఖ పనులు చూస్తూనే, ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి శతశాతం అమలుకు అధికారులంతా కృషి చేయాలన్నారు. పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఎలాంటి ఉల్లంఘనలకు అవకాశం ఇవ్వరాదన్నారు. 9 చెక్ పోస్టుల వద్ద తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ టీంలు, వీడియో వీవింగ్ ద్వారా ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. ఉల్లంఘనలు, డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాల రవాణాపై ఉన్నతాధికారులకు ఎటువంటి ఫిర్యాదు రాక ముందే చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలు గురించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫామ్-7, 8లను ఈ నెల 26 నాటికి పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, అనుమతుల జారీని వేగవంతం చేయడం, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం పటిష్ఠ అమలు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్‌వీ జయరామ్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, గ్రామ వార్డు ప్రత్యేకాధికారి మంజులవాణి, ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఆర్టీవో ప్రకాశరావు పాల్గొన్నారు.

మత్స్యకారులపై మమకారం!



- ఆ వర్గానికి వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం
- వాసుపల్లికి 'విశాఖ దక్షిణ' టికెట్
- కోలా గురువులుకు ఇప్పటికే కీలక పదవులు
- విజయ్ చందర్‌కు మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ గిరీ
- తెలుగుదేశం, జనసేనలు మొండి చెయ్యి
- మండిపడుతున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : ఇన్నాళ్లూ తెలుగుదేశం పార్టీ మత్స్యకారుల ఓట్లకు 'గాలం' వేసి లబ్ధి పొందడమే తప్ప వారికి తగిన గుర్తింపునివ్వడం గాని, వారి సంక్షేమానికి పాటు పడిన పరిస్థితి గాని లేదు. రాజకీయంగానూ వీరికి కీలక పదవుల్లో ప్రాధాన్యతనిచ్చిన పాపాన పోలేదు. ఎన్నికల్లో కరివేపాకుల్లో వారిని వినియోగించుకుని ఆనక 'తెడ్డు' చూపించడం ఆ పార్టీకి ఆనవాయితీగా వస్తోంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంది. జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీలో మత్స్యకారులకు పెద్ద పీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులకు కీలక పదవులు ఇస్తూ వారి పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంటున్నారు. పార్టీ పదవులే కాదు.. ప్రజా ప్రతినిధులుగా గెలుపొందేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు రాజకీయాల్లోనూ రాణించేందుకు దోహదపడుతున్నారు. విశాఖ జిల్లా విషయానికొస్తే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం అభ్యర్థిగా మత్స్యకార సామాజికవర్గానికి చెందిన వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో ఒక్క నియోజకవర్గం నుంచి కూడా మత్స్యకారునికి పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడం విశేషం. అలాగే మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి తొలుత కోలా గురువులును ఛైర్మన్ చేశారు. అనంతరం గురువులుకు ప్రతిష్ఠాత్మక వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షునిగాను, డీసీసీబీ ఛైర్మన్‌గాను ఛాన్స్ ఇచ్చారు. గురువుల స్థానంలో పేర్ల విజయచందర్‌ను మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు.

ప్రతిపక్షాల తీరుపై గంగపుత్రుల ఆగ్రహం

తమకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనల్లో ఎవరు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారన్న దానిపై మత్స్యకారుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మత్స్యకారుల జనాభా అధికంగా ఉన్న విశాఖ జిల్లాలో ఒక్కరంటే ఒక్కరికీ టీడీపీ, జనసేన పార్టీలు టిక్కెట్లు కేటాయించకపోవడంపై వారు మండిపడుతున్నారు. ఇన్నాళ్లూ తమ ఓట్లు వేయించుకుని ఈ ఎన్నికల్లో తమను పక్కన పెట్టేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాల హయాంలో తమకు ఎవరు ఎక్కువ గుర్తింపు ఇచ్చారో వీరు బేరీజు వేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ రాజకీయంగాను సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తోందని పేర్కొంటున్నారు.

టీడీపీలో గుర్తింపేది?



టీడీపీ అధినేత చంద్రబాబు మత్స్యకారులను ఓటు బ్యాంకుగానే చూస్తారు. ఎన్నికల్లో మత్స్యకారులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునే వారు తప్ప ఏనాడూ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. గుర్తింపు ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల స్థితిగతులనే మార్చేశారు. రాజకీయంగానూ పెద్ద పీట వేస్తున్నారు. మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా మంచి గుర్తింపునిచ్చారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్టు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కేటాయించారు. టీడీపీ, జనసేనలు మాత్రం జిల్లాలో ఎక్కడా మత్స్యకారులకు సీటివ్వలేదు. ప్రస్తుత ఎన్నికల్లో మత్స్యకారులు కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెబుతారు.

- పేర్ల విజయచందర్, ఛైర్మన్, మత్స్యకార కార్పొరేషన్

మరెవ్వరూ ఇవ్వనంత ప్రాధాన్యత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులంటే ఎంతో మమకారం. ఆయన అధికారంలోకి వచ్చాక మా సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారు. అంతేకాదు.. రాజకీయంగానూ ఎదగడానికి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు పాలనలో మత్స్యకారులకు మేలు మాట దేవుడెరుగు. అవమానాల పాల్జేశారు. ఛీత్కారాలకు గురి చేశారు. సీఎం జగన్ తీరు అందుకు విరుద్ధం. నాలాంటి వారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పదవే కాదు.. డీసీసీబీ ఛైర్మన్ కిరీటాన్ని కూడా కట్టబెట్టారు. వాసుపల్లి గణేష్‌కుమార్‌కు విశాఖ దక్షిణ టికెట్టునిచ్చి మత్స్యకారుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. టీడీపీ, జనసేనలు మత్స్యకారులెవ్వరికీ సీటివ్వకపోవడం మాపై వారికున్న అభిప్రాయాన్ని తెలియజేస్తోంది.

- కోలా గురువులు, డీసీసీబీ ఛైర్మన్

టీడీపీకి వాడుకుని వదిలేయడమే తెలుసు



టీడీపీకి మత్స్యకారులను వాడుకుని వదిలేయడమే తెలుసు. ఈ ఎన్నికల్లో జిల్లాలో మాకు ఒక్క సీటు కూడా కేటాయించలేదు. ఓటుతో టీడీపీకి తగిన బుద్ధి చెబుతాం. విశాఖ దక్షిణ సీటును మత్స్యకారులకు కేటాయించి సీఎం వైఎస్ జగన్ మా పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎంతో ఓటు బ్యాంకున్న మమ్మల్ని చంద్రబాబు విస్మరించారు. కోలా గురువులుకు కీలకమైన డీసీసీబీ ఛైర్మన్‌తో పాటు వైస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు కూడా అప్పగించారు. మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేర్ల విజయచందర్‌కు ఛైర్మన్ పదవినిచ్చారు. రాజకీయంగా వైఎస్ జగన్‌లా మరే నాయకుడూ మత్స్యకారులకు ప్రాధాన్యతనివ్వలేదు.

- కొవిరి కొర్లయ్య, మత్స్యకార నాయకుడు, గంగవరం

క్లుప్తంగా

అంది వచ్చిన కొడుకు అనంత లోకాలకు


పవన్‌కుమార్ (ఫైల్)

కశింకోట: ఇంటి యజమాని ఐదేళ్ల క్రితం మరణించాడు. ఇపుడు చేతికి అందివచ్చిన కొడుకు కూడా అనంత లోకాలకు చేరి ఆ తల్లికి గుండె కోత మిగిల్చాడు. పెంపుడు కుక్కను కాలకృత్యాలకు తీసుకెళ్లి ప్రమాదవశాత్తూ ఏలేరు కాలువలో జారిపడి మరణించిన యువకుడి సంఘటనపై సీఐ ఎం.వినోద్ బాబు అందించిన వివరాలు. తాళ్లపాలెం శివారు బంగారయ్య పేటకు చెందిన బుద్దన పవన్‌కుమార్(19) తమ పెంపుడు కుక్కను సమీపంలోని ఏలేరు కాలువ గట్టుకు కాలకృత్యాల కోసం తీసుకెళ్లాడు. అది కాలువవైపు లాక్కొని వెళ్లడంతో, నియంత్రించలేక కాలువలో జారిపడి మరణించాడు. మృతదేహాన్ని వెలికి తీయించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. తల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. వెంకటలక్ష్మికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్. మృతుడు పవన్ రెండో కుమారుడు. వీరి తండ్రి ఐదేళ్ల క్రితం మృతి చెందారు. పవన్‌కుమార్ లంకెలపాలెం వద్ద ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. పవన్ మరణంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనకాపల్లి: తోటాడ జంక్షన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముప్పిడి ఉమామహేశ్వరరావు(23) అనే యువకుడు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు చెప్పారు. అనకాపల్లి నుంచి మునగపాక మండలం తిమ్మరాజుపేటకు బైక్‌పై వెళ్తూ ఎన్‌హెచ్‌పై డివైడర్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



నాడు వంచన.. నేడు ఆసరా

- డ్వాక్రా సంఘాలను మోసం చేసిన చంద్రబాబు
- వాయిదాలు చెల్లించక అప్పుల పాలైన మహిళలు
- సీఎం జగన్ హయాంలో మహారాణుల్లా అతివలు
- వైఎస్సార్ ఆసరాతో బతుకులకు భరోసా
- మొత్తం నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి: పొదుపు ఉద్యమం.. మహిళల్లో క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనం. రూపాయి రూపాయి కూడబెట్టి దాన్ని పరపతిగా చూపి.. తీసుకున్న కొద్దిపాటి అప్పులతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించారు. తమ కాళ్ల మీద తాము నిలబడడమే కాదు.. కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉవ్వెత్తున ఎగసిన పొదుపు ఉద్యమానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పావలా వడ్డీ పథకంతో ఊతమిచ్చారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయాలని తపించారు. ఆ దిశగా కృషి చేశారు.

అంతటి గొప్ప చరిత్ర కలిగిన డ్వాక్రా ఉద్యమం చంద్రబాబు హయాంలో కునారిల్లిపోయింది. ఈ పరిస్థితికి కారణం 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ హామీయే. ఈ హామీ ఐదేళ్లలో ఎన్నో వేల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. బాబు ఇచ్చిన హామీ పుణ్యమాని వాయిదాలు కట్టని పాపానికి డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించింది. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. అక్క చెల్లెమ్మలకు ఆసరాగా నిలిచారు. బాబు ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చి.. మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు.

చంద్రబాబు మాటలు నమ్మి సకాలంలో వాయిదాలు కట్టకపోవడంతో జిల్లాలో వేల సంఘాల సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారు. దీంతో 2018–19 నాటికి పూర్తిగా డిఫాల్ట్ లిస్ట్‌లో చేరిన సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో 150, అర్బన్ ప్రాంతాల్లో 125 వరకు ఉన్నాయి. వడ్డీ, చక్ర వడ్డీలు కలిపి ఏడు నుంచి పది లక్షల వరకు బకాయిలు పేరుకుపోయిన సంఘాలు గ్రామీణ ప్రాంతంలో 192, అర్బన్ ప్రాంతంలో సుమారు 300 వరకు ఉన్నాయి. ఈ సంఘాల్లోని పొదుపు సొమ్ములనే కాదు.. చివరకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మంజూరైన పసుపు కుంకుమ సొమ్మును కూడా బ్యాంకులు తమ అప్పు ఖాతాలకు జమ చేసేశాయి. మిగిలిన బకాయిల కోసం పలు దఫాలు నోటీసులు ఇచ్చిన బ్యాంకులు కోర్టు ద్వారా కూడా నోటీసులు జారీ చేశాయి. దీంతో.. బాబు చేసిన మోసానికి తామేం పాపం చేశామంటూ పొదుపు సంఘాల్లోని మహిళలు గగ్గోలు పెట్టారు.

బాబు కుట్రతో.. వెలివేసిన పరిస్థితులు

బకాయిల కోసం కోర్టు ద్వారా నోటీసులిప్పించడమే కాదు.. ఆ కుటుంబాల్లోని పిల్లలకు ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నింది. ఆదరణ పనిముట్లు సైతం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. హౌసింగ్ రుణాలు, చివరికి మరుగుదొడ్ల పేమెంట్స్ కూడా నిలిపేసింది. ఓ విధంగా చెప్పాలంటే ఆ కుటుంబాలను వెలివేసినట్టుగా చంద్రబాబు ప్రభుత్వం చేసింది.

'ఆసరా'తో సీఎం జగన్ భరోసా

ప్రజాసంకల్ప యాత్రలో అక్క చెల్లెమ్మల దుస్థితిని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వారందరికీ 'ఆసరా'గా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే.. వైఎస్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక బృందాలు చెల్లించాల్సిన బకాయిలను సైతం వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది.

వైఎస్సార్ సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేసి, వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలిచారు. అతివలను అడుగడుగునా బాబు వంచనకు గురి చేయగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రతి అడుగు వారి ఆర్థికాభివృద్ధి కోసమే అన్నట్లుగా భరోసానిచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

రుణమాఫీ జరిగిందిలా..

విశాఖ జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 4,305 ఎస్‌హెచ్‌జీలకు ఉన్న రూ.700 కోట్లకు పైగా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసింది.

అనకాపల్లి జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 31,892 ఎస్‌హెచ్‌జీలకు ఉన్న రూ.992.57 కోట్ల బకాయిలను నాలుగు దఫాలుగా చెల్లించింది.

అల్లూరి జిల్లాలో 2019 ఏప్రిల్ 11 నాటికి 39,743 సహాయక సంఘాలకు ఉన్న రూ.134.37 కోట్ల రుణాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగు దఫాలుగా జమ చేసింది.

ఈ ప్రభుత్వం వల్లే మా బతుకులకు ఆసరా



నా పేరు బండారు లక్ష్మి. మాది అనకాపల్లిలోని 82వ వార్డు నర్సింగరావుపేట. నా భర్త తాతారావుతో కలసి చోడవరం రహదారి ఉడ్‌పేట గవర్నమెంట్ స్కూల్ సమీపంలో కొబ్బరి బొండాలు, నూడుల్స్ దుకాణం ఏర్పాటు చేసుకున్నాం. రోజువారీ వడ్డీకి అప్పులు తెచ్చి చాలీచాలని రాబడితో కుటుంబాన్ని పోషించుకునే బతుకులు మావి. అలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ ఆసరా పథకంలో మా డ్వాక్రా గ్రూపు నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. గత ప్రభుత్వంలో మా డ్వాక్రా గ్రూప్ రుణం రూ.4.40 లక్షలు ఉండేది. నాలుగు విడతల్లో విడతకు రూ.లక్షా 10 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. నాకు అందిన నగదుతో మా వ్యాపారాన్ని కొంత అభివృద్ధి చేసుకున్నాం. ఇపుడు వ్యాపారంలో ఖర్చులు పోగా రోజుకు రూ.వెయ్యి మిగులుతోంది. నా కూతురు పుణ్యవతికి పెళ్లి చేశాం. మారేడుపూడిలో ఇచ్చిన జగనన్న కాలనీ ఇంటి నిర్మాణం తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాం. నిర్మాణ పనులు పూర్తయ్యాక జగనన్న కాలనీకి వెళ్లిపోతాం. మాలాంటి పేదల్ని ఆదుకునే జగన్‌బాబునే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

ఆసరాతో ఎంతో మేలు జరిగింది



నా పేరు కోన అరుణ. కుటుంబంతో కలసి బోదువలసలో నివాసం ఉంటున్నాను. 2013 నుంచి శ్రీ చైతన్య స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నాను. ఈ ప్రభుత్వం రాకముందు గ్రూపులోని సభ్యులమంతా ఒక్కొక్కరం రూ.75 వేలు చొప్పున బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న రుణం మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా ద్వారా మాఫీ చేసింది. రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతం బేకరీ నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాను. నా భర్త శ్రీను ఆటో నడుపుతూ బేకరీ నిర్వహణలో సాయపడుతున్నారు. మా అబ్బాయికి అమ్మ ఒడి వచ్చింది. నా భర్తకు 10 వేలు చొప్పున వాహన మిత్ర అందుతోంది. మా అత్తకు వైఎస్సార్ చేయూత, మామయ్యకు రైతుభరోసా జమవుతోంది. సొంతింటి కలను కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చింది. ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అందించడంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇంటి శ్లాబ్ పూర్తయింది. తుది దశకు పనులు చేరుకున్నాయి.

రూ.7.32 లక్షలు రుణమాఫీ జరిగింది



నా పేరు కె.మంగవేణి. అక్కయ్యపాలెంలోని గ్రామికనగర్‌లో నివాసం ఉంటున్నాను. సత్యదానంద పొదుపు సంఘం అధ్యక్షురాలిగా 17 ఏళ్లుగా ఉన్నాను. 2019 ప్రారంభంలో మా గ్రూపులో ఉన్న 10 మంది కలిసి రూ.7.50 లక్షలు రుణం తీసుకున్నాం. రెండు నెలలు వాయిదాలు కట్టాం. ఇంతలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు రూ.7.32 లక్షలు రుణమాఫీ జరిగింది. గ్రూపులో ప్రతి సభ్యురాలికి రూ.18,300 చొప్పున నాలుగు విడతలుగా ఆసరా డబ్బులు జమయ్యాయి. కరోనా సమయంలో కూలి పనులు లేక.. చేతికి డబ్బులు అందక పిల్లల పోషణకు సైతం ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వానికి ఆదాయం లేక పోయిన ఆ సమయంలో ఆసరా డబ్బులు జమ చేసింది. అప్పుడు ఇంటి ఖర్చులకు చాలా ఉపయోగపడ్డాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అనడమే కాని ఎప్పుడూ జరగలేదు. సీఎం జగన్ చేసిన మేలు ఎప్పటికీ మర్చిపోం.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- అభ్యర్థులు సింగిల్ విండో సిస్టంలో దరఖాస్తు చేసుకోవచ్చు
- సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా..
- 'సాక్షి'తో అనకాపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జాహ్నవి



అనకాపల్లి: ప్రశాంత వాతావర్ణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని పక్కాగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాజకీయ పార్టీలు వివిధ రకాల అనుమతులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా పొందవచ్చని చెప్పారు. నామినేషన్లు, ప్రచారాలు, పోస్టర్లు, కరపత్రాలు, వాహనాల అనుమతులకు సువిధ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలు, ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని చెప్పారు.

62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో 2,10,897 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1,01,744 పురుషులు, 1,09,148 స్త్రీలు, 5 థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా 251 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. ఈ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 7702896799కి ఫోన్ చేయవచ్చని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు 2 వేల మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. ఈ నెల 16 నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని చెప్పారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూట్నీ చేస్తామని తెలిపారు. 29న విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నియోజకవర్గంలో ఇద్దరు ఏఆర్‌వోలను నియమించినట్టు చెప్పారు. 251 మంది బీఎల్‌వోలు, 2 ఈఆర్వోలు ఎన్నికల విధుల్లో పాలుపంచుకుంటారని, 251 ఈవీఎంలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల పర్యవేక్షణకు స్టాటిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, అకౌంట్, వీడియో తదితర విభాగాలకు 3 టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మద్యం, నగదు, తాయిలాల పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నియమావళి ఉల్లంఘిస్తే ఎలక్షన్ కమిషన్ నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రచారంలో లౌడ్ స్పీకర్ల వినియోగం, ప్రచార ర్యాలీలకు ఆయా పార్టీల నేతలు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. వాహనాలు, ప్రచారం సంబంధించి అనుమతులకు సింగిల్ విండో పద్ధతిలో దరఖాస్తు చేసుకునేలా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేశామని, సువిధ పోర్టల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టి బొమ్మలతో ఊరేగింపు నిర్వహించకూడదని, ఇప్పటివరకూ సీ విజల్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయని, నేరుగా రాతపూర్వక ఫిర్యాదులు తీసుకుంటామని తెలిపారు.

కంట్రోల్ రూమ్

ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 1950 కాల్ సెంటర్‌తో పాటు వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించనున్నట్టు రిటర్నింగ్ అధికారి జాహ్నవి తెలిపారు.

వ్యాన్ బోల్తా.. ఒకరి మృతి


బోల్తాపడిన వ్యాన్


విలపిస్తున్న మృతుడు లక్ష్మణ కుటుంబసభ్యులు (ఇన్‌సెట్) మృతుడు దాసరి లక్ష్మణ (ఫైల్)


గాయపడిన కూలీలు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం

అనంతగిరి/దేవరాపల్లి : అనంతగిరి మండలంలోని పెదకోట పంచాయతీ కుడియా సమీపంలోని బ్రేక్ ఫెయిల్ కారణంగా ధాన్యం లోడ్‌తో వెళుతున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలానికి చెందిన ధాన్యం వ్యాపారి గంగరాజు వద్ద కాశీపురం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ, కోటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడు కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు శుక్రవారం ఉదయం ధాన్యం కొనుగోలు చేసేందుకు అనంతగిరి, హుకుంపేట మండలంలోని పెదకోట మీదుగా వ్యాన్‌లో వెళ్లారు. ధాన్యం కొనుగోలు చేసుకుని తిరిగి వస్తుండగా కుడియా సమీపానికి వచ్చేసరికి బ్రేక్ ఫెయిల్ కావడంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దాసరి లక్ష్మణ (55) ఘటన స్థలంలోనే మతిచెందాడు. కోటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ రవి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను పినకోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం దేవరాపల్లి నుంచి మెరుగైన వైద్య సేవలు నిమిత్తం 108లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

కాశీపురంలో విషాదఛాయలు

వ్యాన్ బోల్తా ఘటనలో కూలీ దాసరి లక్ష్మణ మృతితో అతని స్వగ్రామం కాశీపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య సీత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఉషా విశాఖపట్నంలోని పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. కుమారుడు బాలాజీ డిగ్రీ పూర్తి చేశాడు. చిన్నకుమార్తె వరలక్ష్మి వలంటీర్‌గా పనిచేస్తోంది. లక్ష్మణ మృతితో వారంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

జెండా పోల్ తొలగిస్తుండగా వీఆర్ఏకు విద్యుత్ షాక్

ఎస్.రాయవరం: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా వమ్మవరం గ్రామంలో ఓ రాజకీయ పార్టీ జెండాపోల్‌ను తొలగిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై వీఆర్‌ఏ గాయపడ్డాడు. గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న గోరింట్ల వీరదాసు శుక్రవారం జెండా పోల్‌ను తొలగిస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు ఆయనను నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయలక్ష్మి మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు.

ఏఎల్‌పురంలో టీడీపీకి భారీ షాక్


వైఎస్సార్‌సీపీలో చేరిన సభ్యులతో ఎమ్మెల్యే గణేష్

- 120 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఈ గ్రామంలో ఆ పార్టీకి చెందిన 120 కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీనియర్ నాయకులు చిటికెల భాస్కర్‌నాయుడు, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ బుల్లిప్రసాద్, శివ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ చేరారు. వారిని ఎమ్మెల్యే గణేష్ వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఈ నియోజకవర్గానికి ఏం చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. అయ్యన్న కొడుకు విజయ్ పిట్టలదొర మాదిరిగా ఐదేళ్లకొకసారి ఎన్నికల ముందు వచ్చి తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అయ్యన్న, ఆయన కుమారుడు విజయ్ కాంట్రాక్టర్లను బెదిరించి రూ.కోట్ల దోచుకున్నారని ఆరోపించారు. కుమారుడు విజయ్‌కు ఎంపీ టిక్కెట్ ఇప్పించుకోలేని దుస్థితిలో అయ్యన్న ఉన్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని చెప్పారు. మాకవరపాలెంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల, 630 పడకలతో ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జీ, జక్కు నాగమణి, యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు


కొండబాబు (ఫైల్)


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

మాడుగుల: మండలంలో వొమ్మలి గ్రామానికి చెందిన కర్రి కొండబాబు(28)అనే యువకుడు గాదిరాయి గ్రామం నుంచి ఎం.కృష్ణాపురం వెళ్లే దారిలో గల చిన్న వంతెన వద్ద అనుమానాస్పదత స్థితిలో మృతి చెందాడు. కుటంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలు... కొండబాబు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, మూడేళ్ల పాప, ఏడాది వయస్సున్న బాబు ఉన్నారు. ఇటీవలే బాబు పుట్టిన రోజు వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కొండబాబు గురువారం రాత్రి 8 గంటల వర కు గ్రామంలో అందరితో సరదాగా కలిసి తిరిగాడు. శుక్రవారం తెల్లవారే సరికి గాదిరాయి సమీపంలో వంతెన పక్కన అనుమానాస్పద స్థితిలో మరణించాడు. వంతెన పక్కన అతని బైక్ స్టాండ్ వేసి ఉంది. కొండబాబు మృతి వార్త తెలుసుకున్న భార్య నాగసుశీల గుండెలవిసేలా విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ స్వామినాయుడు, మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ మృతదేహాన్ని పరిశీలించాయి. మృతదేహాన్ని పోస్టు మార్టానికి అనకాపల్లి తరలించినట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

24న పడమటమ్మలోవలో శాంతి హోమం

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద వెలసి ఉన్న పడమటమ్మ లోవలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు శాంతి హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పెనిమిటి సాంబమూర్తి తెలిపారు. పడమటమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి హోమ సామగ్రితో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవం



మలసాల భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ

కశింకోట: మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామికి తమలపాకుల అర్చన, సింధూర అర్చనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పూలమాల వేసి, జ్ఞాపికను అందించారు. స్వామిని స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం తీర్థ మహోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ శ్యామ్, పార్టీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుమ్మం ఆలయంలో సప్త ప్రాకార సేవ



సప్త ప్రాకార సేవలో పాల్గొన్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వామివారి కల్యాణంలో భాగంగా ఆలయ బేడా మండపంలో అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు, ప్రసాద్‌బాబు సప్తప్రాకార సేవ నిర్వహించారు. సేవలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 2,607 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,590
మొదటి రకం	3,540	4,210
రెండో రకం	3,450	3,800
మూడో రకం	3,250	3,570

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	: షిర్డిసాయి
ఓం భీం బుష్	: పర్తిసాయి
నువ్వు నేను	: వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



- ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉచితం
- ఒకటో తరగతి ప్రవేశాలకు ఈ నెల 25 తుది గడువు
- ఒక్కసారి ఎంపికైతే పైసా ఖర్చులేని కార్పొరేట్ విద్య
- ఇప్పటి వరకు 628 మంది విద్యార్థులు దరఖాస్తు



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

తమ పిల్లలకు అత్యుత్తమ పాఠశాల విద్య అందించాలి. కార్పొరేట్ స్కూళ్లలో మా పిల్లలూ చదువుతున్నారని చెప్పుకోవాలన్న ఆశ తీరేందుకు తమకున్న ఆర్థిక పరిస్థితి సరిపోదు. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యాహక్కు చట్టం-2009 పటిష్ట అమలుకు సిద్ధపడింది. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కూడా సీట్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు కసరత్తు మొదలెట్టింది.

అనకాపల్లి(యలమంచిలి రూరల్): ఆర్థిక సమస్యలతో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదవలేక పోతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యా హక్కు చట్టం ద్వారా పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల విద్యను అందిస్తోంది. రెండేళ్లుగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తూ ఆసరాగా నిలుస్తోంది.

మరో రెండు రోజులే గడువు

2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ముందుగానే నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యా హక్కు చట్టం -2009 సెక్షన్ 12(1), (సీ) ప్రకారం ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. ఇందుకు విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయరాదు. ప్రభుత్వమే కేటగిరీల వారీగా నిర్ణయించి ఫీజుల్ని సదరు యాజమాన్యా లను చెల్లిస్తుంది. దరఖాస్తు చేసుకున్నవారిలో ఎంపికైన విద్యార్థులను తప్పనిసరిగా ఆయా పాఠశాలల్లో చేర్చుకోవాలి. అందుకు నిరాకరిస్తే సంబంధిత యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు మార్చి 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ముచ్చటగా మూడో ఏడాదీ..

ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఈ ప్రవేశాల ప్రక్రియకు 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వరుసగా మూడో ఏడాది ప్రవేశాల కోసం ప్రభుత్వం క్రమం తప్పకుండా నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రవేశాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లోని పేద విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తున్నారు. రిజర్వేషన్ల మేరకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి సీట్లను కేటాయిస్తారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న ధనిక వర్గాల పిల్లలతో సమానంగా పేద పిల్లలు చదువుకోవాలన్న సీఎం జగన్ ఆశయానికి అనుగుణంగా ఉచిత విద్యను హక్కుగా **ఆయా వర్గాల పిల్లలు** పొందుతున్నారు.

చిరునామా 'ఆధార్'ంగా!

ఆధార్‌లో ఉన్న చిరునామా ప్రామాణికంగా విద్యా**ర్థుల నివాస స్థలా**నికి కిలోమీటర్ పరిధిలో ఉన్న **స్కూళ్లకు తొలి** ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత 3 **కి.మీ. పరిధి స్కూళ్లను** కేటాయిస్తారు. తల్లిదండ్రుల **వార్షికాదాయం** గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 **లక్షలు, పట్టణ ప్రాంతా**ల్లో రూ.1.44 లక్షలు. పట్టణ **ప్రాంతాల్లో ఒక్కో** అడ్మిషన్‌కు రూ.8 వేలు, గ్రామీణ **ప్రాంతాల్లో రూ.6,5**00 ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. **ఈ ఫీజు మొత్తా**న్ని అమ్మఒడి పథకం ద్వారా **ఏటా ప్రభుత్వం** అందిస్తున్న ఆర్థిక సాయం నుంచి **తల్లిదండ్రులు చెల్లిం**చాలి.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	నమోదైన స్కూళ్లు	దరఖాస్తులు
అనకాపల్లి	50	527
కశింకోట	14	101
మొత్తం	64	628

సద్వినియోగం చేసుకోండి



ఈ ప్రభుత్వం విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఖచ్చితంగా పేద బడుగు, బలహీన వర్గాలకు కేటాయించేలా చర్యలు తీసుకుంది. పేద విద్యార్థులకు ఇది చాలా మంచి అవకాశం. అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరో రెండు రోజులే గడువుంది. దరఖాస్తు చేయాలనుకునేవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా cse. ap.gov.in వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

– చిట్టిబాబు, ఎంఈవో-1, అనకాపల్లి

నీటి సంరక్షణతోనే మానవ మనుగడ



సేంద్రయ సాగుపై విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

అనకాపల్లి: మండలంలోని బవులవాడ, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్(గుంటూరు) ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ ఇన్ అగ్రికల్చర్ ప్రతినిధి(ఐసీఆర్‌పీ) విల్లూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో నీరు చాలా ప్రధానమైదని, మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని సంరక్షించుకోవాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే పంటలను పండించుకునే విధానాలను తెలిపారు. చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. మర్చంట్ అసోసియేషన్ లింగమూర్తి కాలేజీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులకు సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ కోఆర్డినేటర్ స్వాతి, శారద వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

అనకాపల్లి: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి పురస్కరించుకుని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. శనివారం జరిగే వర్ధంతి సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

కూటమికి ఓటమి తప్పదు

- పొత్తులతో ఎంత మంది కలిసినా విజయం వైఎస్సార్‌సీపీదే
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలన సాగిందని ఆ పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 52 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఇప్పటికే గ్రామీణ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా కూటమికి ఓటమి తప్పదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి, ప్రజలకు మరింత అభివృద్ధి, సంక్షేమం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, కశింకోట, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్, పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు కుండల రామకృష్ణ, కె.ఎం. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

అనకాపల్లి: కశింకోట మండలం సుందరయ్యపేట గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు 60 మంది వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జనసేన నాయకుడు కె.బ్రహ్మాజీ ఆధ్వర్యంలో చేరిన వీరికి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమాభివృద్ధి ప్రతిపక్ష పార్టీల వారిని కూడా ఆకట్టుకుంటోందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించడం తథ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ పదేళ్లుగా జనసేనలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసినప్పటికీ పార్టీ తనకు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. పార్టీ కోసం సొంత నగదు ఖర్చు చేసినట్లు తెలిపారు. జనసేన-టీడీపీ-బీజేపీ పొత్తు ఏర్పడిన నుంచి తమపై దాడులు పెరిగాయన్నారు. జనసేనకు అంకితభావంతో కృషి చేసిన తమలాంటి వారికి పార్టీలో గుర్తింపు లేకపోవడం వలనే తామంతా వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో బి.సురేష్, బాలాజీ, సాయి, మణికంఠ, వాసు, శ్రీను, నాయుడు, రాజేష్, రమణ, రమేష్‌తో తదితరులున్నారు. కార్యక్రమంలో కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని అధిగమించేందుకు సమష్టి కృషి అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: దేశంలో నీటి ఎద్దడిని అధిగమించడానికి ప్రభుత్వాలు, ఎన్‌జీవోలు, ప్రజలు సమష్టిగా కృషిచేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ నీటిదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటివనరులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు నాటితే వాతావరణంలో మార్పులు సంభవించి నీటికొరత తీరుతుందన్నారు. వర్షపునీరు నిల్వ ఉండే విధంగా చెరువులు, జలాశయాలు, నీటిగుంతలను అధికంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. బెంగళూరు నీటి సమస్య ఎక్కువగా ఉందని, రానునున్న రోజుల్లో మిగిలిన నగరాల్లో ఇటువంటి సమస్యలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, టి.శ్రీలత, డి.ఉమామహేశ్వరరావు, ఎం.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

చెరకు నరికే యంత్రంపై శిక్షణ

మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు స్థానిక ఆర్ఏఆర్ఎస్ పరిధిలో 8మంది చెరకు రైతులను తీసుకుని వెళ్లి చెరకు నరికే యంత్రాలపై శిక్షణ ఇచ్చినట్టు ఏడీఆర్ పి.వి.కె. జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు నరికే యంత్రం ధర సుమారు రూ.60లక్షలు ఉంటుందన్నారు.

చెరకు నరికేందుకు టన్నుకు కూలీలు ద్వారా రూ.1000 ఖర్చు అయితే యంత్రం ద్వారా రూ.400 అవుతుందన్నారు. సోలాపూర్‌లో చెరకు నరికే యంత్రంపై శిక్షణ పొందిన రైతులు సన్యాసినాయుడు, కృష్ణప్రసాద్, ఎం.కృష్ణారావులు మాట్లాడుతూ యంత్రంపై శిక్షణ తీసుకున్నామని, చాలా ఉపయోగకరంగా ఉందని తెలిపారు.

ప్రశాంతంగా టెన్త్ గణితం పరీక్ష

తుమ్మపాల: జిల్లాలోని 108 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి గణితం పరీక్షకు 97.8 శాతంతో 22,084 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 21,258 మంది రెగ్యులర్ విద్యార్థుల్లో 116 మంది, 1,312 మంది ప్రైవేట్ విద్యార్థుల్లో 370 మంది కలిపి మొత్తం 486 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నా రు. తన(డీఈవో) బృందం 7 కేంద్రాలను, 8 స్క్వాడ్ బృందాలు 46 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



అమీన్‌సాహెబ్‌పేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

కశింకోట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలంతా తమ సంపూర్ణ సహకారం అందించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో శుక్రవారం గడప గడపకు వెళ్లి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు ఇలా అనేక సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని వివరించారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు కొనసాగుతాయన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కరపత్రాలను పంచిపెడుతూ, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనకు ఘన విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కశింకోట పూసర్లవీధిలో..

స్థానిక పూసర్ల వీధి ప్రాంతంలో భర్త భరత్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి నివేదిత ఇంటింటికీ వెళ్లి, ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ భార్య అనూరాధ, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు యల్లపు నూకరత్నం, చెవ్వేటి చంద్రమ్మ, వార్డు సభ్యురాలు కొమ్మిరెడ్డి లక్ష్మి, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



కశింకోటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సతీమణి నివేదిత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. భరత్ రాకను తెలుసుకున్న స్థానికులు అపార్ట్‌మెంట్ల వద్ద నిరీక్షించారు. వారిని కలిసి రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా సహకారం అందించాల్సిందిగా ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, తనకు ఘన విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు భరత్‌కుమార్‌కు మంగళహారతులు పట్టి, తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పార్టీ నాయకులు గుమ్మడి నారాయణరావు, ఇందలి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



బంగారయ్యపేటలో ఎన్నికల ప్రచారంలో స్థానికులతో మలసాల భరత్‌కుమార్



80వ వార్డులో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ నీలిమ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను గెలిపించాలంటూ కార్పొరేటర్ కొణతాల నీలిమ శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా జీవీఎంసీ 80వ వార్డులో గడప గడపకూ తిరిగారు. కరపత్రాలను పంపిణీ చేశారు. తమ ప్రభుత్వం జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. తమ అమూల్యమైన ఓటు ముద్రను ఫ్యాన్ గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, సత్యనారాయణ స్వామి దేవస్థానం ధర్మకర్త మారిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుమ్మపాల: కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీ చింతామణి గణపతి దత్త క్షేత్రం ట్రస్టీ ఎ.రవికుమార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి ప్రాథమిక పాఠశాలలో దత్త క్షేత్రం, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక ఆహారంతో పాట ఆకుకూరలు, కంటి సంబంధిత పోషకాలుండే పదార్థాలను విద్యార్థులు ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో చూపు మందగించిన విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. 110 మంది విద్యార్థులకు, 40 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఎం.ఆంజనేయరాజు, ట్రస్ట్ ల్యాండ్ డోనర్ సీపీ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవానికి పందిరిరాట



ఆలయ ప్రాంగణంలో పందిరి రాట వేసిన పూజారులు

పరవాడ: రావాడ శివారు జల్లెలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పూజారి దంపతులు పందిరిరాట వేసి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వియ్యపు చిన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, ఎం.సోము నాయుడు, పి.అప్పారావు, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కేజ్రీవాల్ అంటే బీజేపీకి భయం'

అనకాపల్లి: ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత కేజ్రీవాల్ అంటే బీజేపీకి భయమని, ఆయన అన్ని రాష్ట్రాలు తిరిగి, ప్రచారం చేస్తే బీజేపీకి ఎవరూ ఓటేయరనే అక్రమ అరెస్ట్‌కు తెగబడ్డారని ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువల్ని పూర్తిగా మంటగలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థపూరిత పార్టీలతో పొత్తులు పెట్టుకుంటూ రాష్ట్ర భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.